క్లుప్తంగా

'గాదె' విజయంపై హర్షం



స్వీట్లు పంచుతున్న పీఆర్‌టీయూ సభ్యులు

రావికమతం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడంతో పీఆర్‌టీయు రాష్ట్ర కన్వీనర్ జి.పి.ఎస్ నాయుడు మాస్టర్, రావికమతం మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు ప్రకాష్, కార్యదర్శి వి.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తారని అన్నారు. వివిధ పాఠశాలల్లో స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు.

ఆశాజనకంగా మినప పంట



మినప చేను నుంచి పంట సేకరిస్తున్న మహిళా రైతులు

రోలుగుంట : మండలంలో సుమారు 930 ఎకరాల విస్తీర్ణంలో మినపసాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి కోతల అనంతరం రైతులు తమ పంట భూముల్లో ఈ పంట సాగు చేశారు. పంట కోతకు రావడంతో చేను నుంచి పంట సేకరణ పనులు చేట్టారు. ఖరీఫ్ కోతల సమయంలో ఎకరాకి సుమారుగా కుంచెడు విత్తనాలు చల్లితే చాలని, అప్పటి పదునుకు విత్తనాలు మొలకెత్తు తాయని, తరువాత మంచు తడులకు పంట అభివృద్ధి చెందుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకి 200 కుంచాల పైబడి దిగుబడి వస్తుందని, కుంచం ధర రూ. 300 పైబడి ఉందని తెలిపారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి



పార్టీ నాయకులతో కలిసి ఆవిర్భావ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీర సూర్యచంద్ర

నర్సీపట్నం : ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిర్భావ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సభకు నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శులు అల్లాడ సురేష్, నమ్మి రమణరాజు, దొరబాబు, వెంకటరమణ, రామశేఖర్, చిరంజీవి, నారాయణరావు, శివ, మంగ పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు నిర్వాహకులకు అభినందన



గుప్తా బృందాన్ని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బేతిరెడ్డి విజయ్‌కుమార్

నర్సీపట్నం : నర్సీపట్నంలో నూతనంగా బ్లడ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన గుప్తా బృందాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ కోసం విశాఖపట్నం వెళ్లవలసి వచ్చేదని, సరైన డాక్యుమెంట్స్, శాంపిల్స్ లేకపోయినా తిరిగి రావాల్సి వచ్చేదన్నారు. డోనర్ లేకపోయిన, డోనర్ ఉండి వైజాగ్ రాకపోయినా బ్లడ్ కోసం ఎన్నో అవస్థలు పడేవారన్నారు. గుప్తా బృందం బ్లడ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలుదాయకమని అన్నారు. బ్లడ్ తీసుకోవడమే కాకుండా బ్లడ్ ఇవ్వడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: ప్రకృతి వ్యవసాయం పద్ధిలో సాగు చేయడం ద్వారా ఇంటిల్లిపాదికి సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని స్థానిక సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్. యశోద అన్నారు. మండలంలోని బోయిలకింతాడలో సర్పంచ్ బూరె బాబూరావు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. సేంద్రియ ఎరువులతో సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆరోగ్యకర పంటలు పొందవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమి సైతం సారవంత మవుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు వీవోఏ జాజిమొగ్గల మానస, అన్నం సాంబమూర్తి, రాముడు నాయుడు, కొప్పాక దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఉరకగెడ్డపై వంతెన నిర్మించాలి



ఏడు గ్రామాలకు అనువుగా ఉరకగెడ్డ మీద వంతెన నిర్మించాలి. దీని వల్ల ఈ గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా ఉంది. వర్షాకాలంలో తుపాన్లు సమయంలో గెడ్డ పొంగి ప్రవహిస్తే ఈ గ్రామాల ప్రజలకు సంబంధాలు తెగిపోతాయి. వైద్యం, నిత్యావసర సరుకుల కోసం కూడా ఈ గెడ్డ దాటి వెళ్లాల్సిందే.

–శోలం రమేష్, సర్పంచ్, శంకరం గ్రామం

శివారు గ్రామాల కష్టాలు తీర్చాలి

మండలంలో శంకరం పంచాయతీ శివారు మామిడిపాలెం వద్ద ఉరకగెడ్డ మీద వంతెన నిర్మించాలి. దీని వల్ల శివారు గ్రామాలకు ఇబ్బందులు తొలగితాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అయినా సరే నిధులిచ్చి వంతెన నిర్మించాలి. తాటిపర్తి పంచాయతీ శివారు అజయపురం గ్రామానికి వెళ్లే దారిలో గెడ్డ మీద వంతెన నిర్మించాలి.

–ఇ.నర్సింహమూర్తి, మండల సీపీఎం ప్రధాన కార్యదర్శి, మాడుగుల



ఉరకగెడ్డ మీద వంతెన లేక గెడ్డలో నుంచి రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

ఏడు గ్రామాలకు ఏళ్ల నాటి కష్టాలు!



వారపు సంతకు పండిన ఫలసాయాన్ని తీసుకొస్తున్న గిరి మహిళలు

- శంకరం పంచాయతీ పరిధిలో తీరని రవాణా కష్టాలు
- ఉరకగెడ్డ ఆవలి గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక అవస్థలు
- వర్షాలు కురిసినపుడు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్
- అజేయపురం దారిలో తాచేరు గెడ్డపై వంతెన కలేనా?

అజయపురం గ్రామస్తులకు రహదారి వంతెన నిర్మించాలి

తాటిపర్తి పంచాయతీ శివారు అజయపురం గ్రామానికి పోవు రహదారితో పాటు వంతెన నిర్మించాలని ఈ గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ గ్రామానికి చేరుకోవాలంటే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి పోవు రహదారిలో తాచేరు పోవు గెడ్డ నీటి నుంచి రాకపోకలు సాగించాలి. వంతెన నిర్మించాలని కోరుతున్నారు. నాలుగు మాసాల క్రితం జిల్లా అధికారులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి అధికారులకు ప్రతిపాదిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు.



తాటిపర్తి పంచాయతీ అజేయపురం గ్రామస్తులు తాచేరు గెడ్డలో నుంచి వస్తున్న వైనం(ఫైల్)

మాడుగుల రూరల్ : ఉరకగెడ్డ రిజర్వాయరు అవతలి వైపున వున్న గిరిజన గ్రామాల ప్రజలకు సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు గిరి గ్రామాలను అనుసంధానం చేస్తూ బీటీ రహదారులు నిర్మించారు. మండలంలో శంకరం గ్రామ పంచాయతీ పరిధిలో గల శివారు ఏడు గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు వారి ఓట్ల కోసం అభ్యర్థించే నాయకులు ఎన్నికల అనంతరం వారి ముఖం కూడా చూడడం లేదని గిరిజన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట, మామిడిపాలెం, గిరిజన గ్రామాల్లో సుమారు 2వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామాలు ప్రజలు రోజూ ఉరకగెడ్డ దాటి వెళ్లాల్సిందే. నిత్యావసర సరుకులు కోసం, వైద్య సేవలు కోసం సమీపంలో గల మాడుగుల, లేదా చోడవరం, రావాల్సిందే. గర్భిణులు, వృద్ధులు, వైద్య సేవలు కోసం వెళ్లాలంటే సమీపంలో గల కె.జె.పురం, మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే. వర్షాకాలంలో వీరి పరిస్థితి చెప్పలేని స్థితిలో ఉంటుది. ఆకాల తుఫాన్లు, వల్ల ఉరకగెడ్డ పొంగి ప్రవహిస్తే ఈ గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ గెడ్డ పొంగితే ఈ గ్రామాలకు పూర్తిగా రవాణా సౌకర్యం నిలిచిపోతుందని, నీటి ఉధృతి తగ్గే వరకు గ్రామం దాటి వెళ్లడానికి అవకాశం లేదు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా అందే ప్రభుత్వ వైద్య సేవలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్ సమస్య, వంటి సమస్యలు కూడా వీరిని వెంటాడుతున్నాయి. గిరిజన సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పిస్తున్నా సరే మైదాన ప్రాంతంలో విలీనమైన ఈ గిరిజన గ్రామాలకు ప్రధాన సమస్యగా వున్న ఉరకగెడ్డ వంతెన నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు సహకరించి, వంతెన నిర్మించాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే గిరి ఓటర్లు గుర్తుంటారని, తర్వాత ఐదు సంవత్సరాల వరకు ప్రజా ప్రతినిధులు ముఖం చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'వాహనమిత్ర' అమలు చేయరూ..



డిమాండ్లపై నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

మాకవరపాలెం: వాహన మిత్ర పథకాన్ని వెంటనే అమలు చేయాలంటూ మండల కేంద్రంలో ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ వాహన మిత్ర ఏటా రూ.15వేలు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. అధిక జరిమానాలు విధించే జీవో నంబర్ 21, 31 లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, లేబర్, గ్రీన్ ట్యాక్స్, ఇన్సూరెన్స్‌లు ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు నోరు మెదపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీ నర్సింహులు

మాకవరపాలెం: గాలికుంటు వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్ నర్సింహులు సూచించారు. మండలంలోని భీమబోయినపాలెంలో మంగళవారం పశువులకు వేస్తున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, చూడి పశువుల్లో అబార్షన్లు సంభవిస్తాయని అన్నారు. వ్యాధి లక్షణాలను ఏమాత్రం గుర్తించినా వెంటనే పశు వైద్యులను సంప్రదించాలన్నారు.

రూ.4.5 లక్షలతో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో రూ.4.5 లక్షలతో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేస్తున్నట్టు సర్పంచ్ అల్లంపల్లి శిరీష తెలిపారు. ఈ కాలనీలో జరుగుతున్న పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక కాలనీలోని కొన్ని ఇళ్లు నీట మునుగుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈ ప్రాంతంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు.

వైభవంగా కాత్యాయిని పూజలు



కాత్యాయిని పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితుడు మూర్తి

నాతవరం : మర్రిపాలెం పంచాయతీ శివారు సిద్ధిపట్నం గ్రామంలో వెలసియున్న శ్రీదుర్గా మల్లేశ్వరిస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు శ్రీమూర్తి శర్మ , శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శ్రీదుర్గా మల్లేశ్వరస్వామికి, ఆంజనేయస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కాత్యాయిని పూజలు నిర్వహించారు. భక్తులందరికీ ఉచితంగా తీర్థప్రసాదాలు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. అనంతరం అన్నసమారాధన జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాథమికోన్నత పాఠశాలను మార్చొద్దు



సమావేశంలో పాల్గొని అభిప్రాయం చెబుతున్న సభ్యులు

రోలుగుంట: తమ గ్రామానికి చెందిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చొద్దని బలిజిపాలెం గ్రామస్తులు తీర్మానించారు. ఇక్కడ ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశమయ్యారు. పాఠశాల స్థాయి ఒకసారి తగ్గితే మళ్లీ పూర్వస్థాయి రాదని, దాని వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తీర్మాన లేఖను జిల్లా కలెక్టర్‌కు. జిల్లావిద్యాశాఖాధికారికి నివేదించనున్నట్టు సభ్యులు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ముత్యాలనాయుడు

చీడికాడ : తురువోలులో అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం ఆయన తురువోలులో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. ఈ ప్రమాదంలో తమకు సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు ముత్యాలనాయుడుకు తెలిపారు. తన బ్యాటరీ సైకిల్ అగ్నిపాలైందని దివ్యాంగుడైన కంచి రాము ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసికెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ముత్యాలనాయుడు వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజుబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్‌లు శివ కుమార్, కోటి, అరుణ్ కుమార్, వెంకునాయుడు, ముర్రు కోటి, నారాయణమూర్తి, సుర్ల అప్పలనాయుడు, కాటి పాములరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో యోగా శిక్షణ



అంగన్‌వాడీ కేంద్రంలో యోగా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కె.కోటపాడులో యోగా కార్యక్రమంలో పాల్గొన్న పీవో మంగతాయారు

రావికమతం :మహిళలు పురుషులకు ఎందులోనూ తీసిపోమని నిరూపిస్తూ అన్ని రంగాల్లో సమానంగా నిలుస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా దొండపూడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, తల్లులకు అంగన్‌వాడీ కార్యకర్తలు యోగ నేర్పించారు. అనంతరం మొక్కలు నాటించారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు దీప, చప్పా లక్ష్మి, జి. రత్నం, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కె.కోటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఐసీడీఎస్ పీవో మంగతాయారు యోగాసనాలను వేశారు. ఈ సందర్భగా మాట్లాడుతూ మహిళలు రక్తహీనత సమస్య నివారించడానికి పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త డోకల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

చోడవరం : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశ వర్కర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. చోడవరంలో సమావేశం నిర్వహించిన ఆశ వర్కర్లు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 6వ తేదీన విజయవాడలో చేపట్టిన రాష్ట్ర ధర్నాకు ఆశ వర్కంతా తరలిరావాలని వారు పిలుపు ఇచ్చారు. ఆశా వర్కర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామలక్ష్మి, జిల్లా నాయకులు కె. వరలక్ష్మి, కె.తార, ఎస్.లక్ష్మి, సిఐటీయూ ప్రతినిధి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం

కేజేపురం శివాలయంలో పలువురికి సత్కారం



కె.జె.పురం శివాలయంలో శివరాత్రి ఉత్సవాలకు కృషి చేసిన భాస్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం



కె.జె.పురం శివాలయంలో డ్రా తీసి భక్తులకు చీరను అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : గత నెల 26 వ తేదీన జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసిన నిర్వాహకులు, భజన భక్తులు, శ్రీ గౌరీ పరమేశ్వర భజన సేన, సభ్యులకు కె.జె.పురం శివాలయంలో సోమవారం రాత్రి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆలయంలో భజన కార్యక్రమం అనంతరం సభ్యులకు శాలువ కప్పి సన్మానించారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు కూపన్లు అందజేశారు. సోమవారం రాత్రి డ్రా తీసి విజేతలకు చీరలు, తువ్వాలు, మిక్సీ వంటి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గౌరీపరమేశ్వర భజన సేన సభ్యులు కొట్యాడ భాస్కర్, పెంటకోట సూరిబాబు, ఆడారి వరహ కన్నారావు తదితరులతో పాటు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల రాము పాల్గొన్నారు. స్థానికులు దాడి రామునాయుడు కుమారుల సహకారంతో చద్దిని ఏర్పాటు చేశారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న బాబూరావు, సర్పంచ్‌లు రామకృష్ణ, చింతల

దేవరాపల్లి : మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మ పాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, కెఎం .పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళల కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలను బాబురావు, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, గంధం రామకృష్ణ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలలో ప్రథమ విజేతగా దేవరాపల్లి వీరాంజనేయ ఎడ్లు, ద్వితీయ స్థానంలో దేవరాపల్లి శ్రీలక్ష్మీనర్సింహ ఎడ్లు, తృతీయ స్థానంలో నర్సాపురం సంపత్ వినాయక ఎడ్లు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 10వేలు, రూ.8వేలు, రూ.6 వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం ఎన్నిక

బుచ్చెయ్యపేట : మండల విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడిగా బి. శ్రీను ఎన్నికయ్యారు. మంగళవారం రాజాం మరిడిమాంబ గుడి వద్ద బుచ్చెయ్యపేట మండల విశ్వ బ్రాహ్మణ సంఘ సమావేశం జరిగింది. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆచారి, ఉపాధ్యక్షుడిగా ఎ.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.లక్షణరావు, సహాయ కార్యదర్శిగా ఆనంద, కోశాధికారిగా పి.భాస్కరరావు, మండల సలహా సభ్యులుగా పి. రామారావు, కన్వీనర్‌గా కె.శ్రీనివాస్, కో కన్వీనర్‌గా తులసీరావులను ఎన్నుకున్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి పాటుపడతామని సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. విశ్వ బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ కన్వీనర్ చుక్కా వెంకట సత్తిరాజు, కో కన్వీనర్ పెదపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేశారు.

ఘనంగా మోదమాంబ అమ్మవారి తీర్థం

- అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం
- అలరించిన ఎడ్ల పరుగు పోటీలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఇతర కమిటీ సభ్యులు



ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

మాడుగుల: మన్యం దేవత, మాడుగుల ప్రజల ఇలవేల్పు మోదమాంబ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, మెక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువరు భక్తులు ఘటాలతో వచ్చి దర్శించుకున్నారు. పండగ సందర్భంగా విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. బాణసంచా వెలిగించారు. థింసా నృత్యం, కోలాటం, నేల నృత్యాలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా ఎడ్ల పరుగుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బాల కార్మికులతో పనులు చేయించడం నేరం



మండల కేంద్రంలో దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న కార్మికశాఖ అధికారి రామచంద్రరావు

నాతవరం : బాల కార్మికులతో పనులు చేయించుకోవడం చట్టా రిత్యా నేరమని నర్సీపట్నం డివిజన్ బాల కార్మికశాఖ అధికారి రామచంద్రరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బాలల సంరక్షణ అధికారి లోవరాజు పోలీసులతో కలిసి పలు షాపులు, ఫ్యాక్టరీలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారితో వెట్టిచాకిరి పనులు చేయడం నేరమన్నారు.

కాలానుగుణంగా మార్పు రావాలి

నాతవరం : కాలానుగుణంగా వస్తున్న వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నాతవరం పీహెచ్‌సీలో మంగళవారం శిశు సంక్షేమం, లింగవివక్ష , బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా ప్రజల్లో చైతన్యం రాకపోతే ఆశించిన విధంగా ఫలితాలు ఉండవన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.